# కేసీఆర్‌కు బాసటగా రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్

- తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు
- నాడు ఉద్యమంలో కలిసి ప్రయాణం
- నేడు రాజకీయ పునరేకీకరణలో కేసీఆర్ వెంటే..

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): మాజీ ఐపీఎస్ అధికారి, బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ) బీఆర్ఎస్‌లో చేరడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్న నేపథ్యంలో ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌ను ఎందుకు ఎంచుకున్నారనేది ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోదీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా సకల కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై విల్లంబులు ఎక్కుపెట్టి తూర్పారబడుతున్న దశలో ఆర్ఎస్పీ చేరిక ఒక ఆసక్తికర పరిణామమని, భవిష్యత్తు పరిణామాలకు సూచిక అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో నాడు ప్రజల కష్టసుఖాలను నేరుగా చూసిన ఎందరో సివిల్ సర్వెంట్స్ (ఐఏఎస్, ఐపీఎస్ సహా స్టేట్‌క్యాడర్ ఉద్యోగులు) కేసీఆర్‌తో కలిసి అడుగులో అడుగులేశారు.

**నాడు ఉద్యమ నిర్మాణంలో..**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న పోరులో తాము కేసీఆర్ వెంట నడుస్తామని పలువురు ఐఏఎస్, ఐపీఎస్ రిటైర్ట్ అధికారులు బీఆర్ఎస్‌లో చేరడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం 2014లో ఆ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్రంలోవారి సేవలకు కేసీఆర్ తగిన ప్రాధాన్యం, గుర్తింపు ఇచ్చి గౌరవించారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో 2011 ఫిబ్రవరి 4న రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఏ రామ్‌లక్ష్మణ్, ఏకే గోయల్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తరువాత ఏప్రిల్ 27న (టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నాడు) ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీగా పనిచేసి రిటైరైన పేర్వారం రాములు, ఆ తరువాత 2013 ఏప్రిల్ 21న తిరుమల తిరుపతి దేవస్థానంలో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ ఐఏఎస్ కేవీ రమణాచారి, ఆ తరువాత మరో సీనియర్ పోలీస్ ఉన్నతాధికారి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లాంటి ఎంతోమంది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్ఎస్పీ చేరికను కూడా అదే కోవలో చూడాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**ఆసక్తికర మలుపులో బహుజన రాజకీయాలు**

పోలీసు ఉన్నతాధికారిగా, రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థకు సుదీర్ఘకాలం కార్యదర్శిగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దళిత బహుజనవాదంపై చిత్తశుద్ధితో ఉన్నారనడానికి వివిధ దశల్లో ఆయన ప్రయాణమే సాక్ష్యమని ఆయనను దగ్గరి నుంచి చూసినవారు చెప్తారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తరువాత తనకు కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రత్యేకించి ప్రభుత్వ పెద్దల నుంచి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవినే ఆఫర్ చేశారని, అయితే తాను సున్నితంగా తిరస్కరించానని వెల్లడించడమే కాకుండా తాను కట్టేసుకునే గొడ్డును కాదని, ప్రశ్నల కొడవళ్లను సంధించే ఆయుధాన్నని ప్రకటించారు. తన రాజకీయ భావజాలానికి బీఆర్ఎస్ సరైన వేదిక అని కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరేముందు కుండబద్దలు కొట్టడం విశేషం. 'తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే నాకు పరమావధి. అందుకే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు బీఆర్ఎస్‌లో చేరుతున్నా' అని ఆర్ఎస్పీ స్పష్టం చేయడంతో రాష్ట్రంలోని మేధావివర్గం, ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాల్లో కొత్త ఆలోచనలు మొదలయ్యాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆర్ఎస్పీ చేరికతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారబోతున్నాయనే వాదన వినిపిస్తున్నది.

## బీహార్ అధికారులకు శిక్షణ ప్రారంభం

- పాల్గొన్న డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): బీహార్ ప్రభుత్వానికి చెందిన 63 మంది సీనియర్ అధికారులకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 23 వరకు మొదటి దశలో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తరగతుల స్టడీ టూర్‌కు సంబంధించిన ఈ కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. బీహార్ రాష్ట్రంలోని రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వెల్ఫేర్, లేబర్, రూరల్ డెవలప్‌మెంట్ వంటి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎస్ రామచంద్రన్, బీఐపీఏఆర్‌డీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సూరజ్‌కుమార్, ఫ్యాకల్టీ శ్రీనివాసమాధవ్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులపై కుదరని ఏకాభిప్రాయం

- 5 కీలక స్థానాలపై సీఈసీ పెండింగ్
- రేపు 8 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటన
- ఢిల్లీ నుంచి వచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ అభ్యర్థుల ఖరారు కోసం మంగళవారం ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఎట్టకేలకు 8 మంది అభ్యర్థులను ఖరారు చేసినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. మిగిలిన 5 కీలక నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరకపోవటంతో పెండింగ్ పెట్టినట్టు తెలిసింది. ఖరారు చేసిన అభ్యర్థుల పేర్లను బుధవారం ఏఐసీసీ అధికారికంగా ప్రకటిస్తుందని ఈ సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కొత్త గవర్నర్‌గా రాధాకృష్ణన్ బుధవారం ప్రమాణం ఉండటంతో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ హైదరాబాద్‌కు వచ్చేయటంతో, పెండింగ్ స్థానాలపై 21న సమావేశమై ఖరారు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. మొత్తం 17 నియోజకవర్గాలకుగానూ మొదటి జాబితాలో నల్లగొండ, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, జహీరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. తాజాగా మరో 8 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడంతో ఇంకా 5 స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీలో కొత్తగా చేరిన ఎంపీ రంజిత్‌రెడ్డికి చేవెళ్ల, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సికింద్రాబాద్, మల్కాజిగిరిలో సునీతామహేందర్‌రెడ్డికి ఎంపీ టికెట్లు దక్కుతాయని భావించినప్పటికీ, వీరి అభ్యర్థిత్వాలపై నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో అనుకూలంగా రాలేదని సమాచారం. ఖమ్మం, భువనగిరి స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఈ ఐదింటిని పెండింగ్‌లో పెట్టినట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలా ఉండగా, అభ్యర్థుల ఖరారుపై దాదాపు మూడు గంటల పాటు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశమైంది. తెలంగాణలో అభ్యర్థుల ఎంపికపై అసంపూర్తి చర్చ జరిగిందని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ అభ్యర్థులపై చర్చ జరిగినట్టు పేర్కొన్నారు.

## లంపీ స్కిన్ వైరస్‌తో ఎద్దు మృత్యువాత

దంతాలపల్లి, మార్చి 19: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామంలో పశువులకు లంపీ స్కిన్ వైరస్ సోకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన కలకుంటి అంజయ్యకు చెందిన పశువుకు ఈ వైరస్ సోకి ఒంటిపై దద్దుర్లు వచ్చి మంగళవారం మృత్యువాతపడింది. మిగతా పశువులకు కూడా వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వైరస్ నుంచి పశువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## కార్తీ చిదంబరానికి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, మార్చి 19: చైనా వీసా కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంతో సహా మరికొందరికి మంగళవారం ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈడీ చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ నిందితులకు సమన్లు జారీచేశారు. కార్తీ చిదంబరం, అతని మాజీ చార్టెడ్ అకౌంటెంట్ ఎస్ భాస్కరరామన్‌తో పాటు మరో ఆరుగురిని ఏప్రిల్ 5న కోర్టుకు హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు. పీ చిదంబరం కేంద్ర హోం మంత్రిగా ఉన్న సమయంలో 263 మంది చైనా పౌరులకు వీసా మంజూరు కుంభకోణంలో కార్తీపై మనీలాండరింగ్ కేసు నమోదైంది.

# రేవంత్, పొంగులేటి బీజేపీతో టచ్‌లో!

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ లక్ష్యంగా ప్రారంభమైన ఢిల్లీ మద్యం వ్యవహారంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయాలని తెలంగాణ బీజేపీ నుంచి డిమాండ్ వచ్చింది. బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనన్న అభిప్రాయం ప్రజల్లో ఉన్నది.. ప్రజలు బీజేపీని నమ్మాలంటే కవితను అరెస్టు చేయాలని బండి సంజయ్, అరవింద్ వంటి వారితో పాటు అనేక మంది అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. కానీ పైనుంచి మాత్రం అసెంబ్లీ ఎన్నికల ముందు అరెస్ట్ చేస్తే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నందున పెద్దఎత్తున సానుభూతి వస్తుందని వారించింది. చివరకు అప్పట్లో బీజేపీతో సంప్రదింపులు చేసిన ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా తాను చేరేందుకు ఇదే షరతు విధించారు. కానీ బీజేపీ హైకమాండ్ ససేమిరా అన్నది. పార్టీలోకి ఎవరు వచ్చినా, రాకున్నా అరెస్టు చేసేది లేదని తేల్చిచెప్పింది.

**బెంగాల్ అనుభవంతోనే ఆ నిర్ణయం**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయకపోవటం వెనుక బీజేపీకి పశ్చిమ బెంగాల్ అనుభవమే ప్రధాన కారణం. అక్కడ మమతాబెనర్జీ లక్ష్యంగా చేపట్టిన ఐటీ, ఈడీ దాడులు, అరెస్టులు ఆమెపై ప్రజల్లో గణనీయమైన సానుభూతిని తెచ్చిపెట్టాయి. దీంతో టీఎంసీ మళ్లీ అధికారంలోకి వచ్చిందనేది బీజేపీ పెద్దల అభిప్రాయం. దీంతో పాటు ఆయా పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఇలాంటి దాడులు చేస్తే తమకు పెద్దగా ప్రయోజనం ఉండదని బీజేపీ అధిష్ఠానం నమ్మింది. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేస్తే ఆయన భార్యను సీఎంగా చేసిన అనుభవాన్ని కూడా తెలంగాణ బీజేపీ నేతలకు అధిష్ఠానం వివరించింది. దీంతో బండి సంజయ్, అరవింద్, కిషన్‌రెడ్డి వంటి వాళ్లు కన్విన్స్ అయ్యారు. కానీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలాంటి వాళ్లు కన్విన్స్ కాలేక పార్టీ మారారు. ఎవరున్నా, పార్టీ మారినా తమ నిర్ణయం మారదని అప్పట్లో బీజేపీ అధిష్ఠానం తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని స్వయంగా బండి సంజయ్ నాతో చెప్పారు.

**కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఫస్ట్ హాఫ్ పూర్తి**

కేజ్రీవాల్ లక్ష్యంగా సాగుతున్న ఢిల్లీ మద్యం వ్యవహారంలో అదను చూసి కవితను అరెస్టు చేశారు. ఇన్ని రోజులు అరెస్ట్ కాకపోవడం వెనక సుప్రీంకోర్టు, న్యాయపరమైన అంశాలు.. ఇవన్నీ ఒట్టి బూటకం. అదే నిజమైతే, ఇప్పుడు సుప్రీంకోర్టులో కేసు ఉండగానే ఎందుకు అరెస్టు చేశారు? అరెస్టు ఎందుకు చేశారనేది పక్కనబెడితే, అరెస్టు చేసిన విధానమైతే తప్పు అని అందరూ ఒప్పుకుంటున్నదే కదా. బీజేపీ పెద్దలు రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉన్నపుడే ఇలాంటి పావులు కదుపుతారు. అందులో భాగంగానే తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలంటే ముందుగా కవితను అరెస్టు చేయాలి. అందుకే అరెస్టు రోజే మల్కాజిగిరిలో ప్రధాని మోదీ పెద్దఎత్తున రోడ్‌షో నిర్వహించడాన్ని అర్థం చేసుకోవాలి. పోలింగ్‌కు ఇంకా 50 రోజులకు పైగా సమయం ఉన్నది. అయినా ప్రధాని ఇటీవల ఐదు రోజుల పాటు తెలంగాణలో ఉన్నారంటే రాష్ట్రంపై బీజేపీ అధిష్ఠానం ఎంత ఫోకస్ పెట్టిందో అర్థమవుతుంది. ఇక, ఢిల్లీలో కేజ్రీవాల్ రోజుల వ్యవధిలోనే (బహుశా ఈ నెల 23 వరకు) ఆయనను అరెస్టు చేస్తారన్న సమాచారం ఉన్నది. కేజ్రీవాల్ న్యాయపరంగా ఏమైనా అడ్డంకులు కల్పించినా రోజుల వ్యవధే తప్ప త్వరలో ఆ అరెస్టుతో ఫస్ట్ హాఫ్‌ను ముగిస్తారు.



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ
Special Interview

### తెలంగాణ లక్ష్యం ఎందుకంటే?!

కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. కానీ బీజేపీ పెద్దలు అక్కడ పెద్దగా గేమ్ ఆడాల్సిన అవసరం లేదనే నిర్ణయానికొచ్చారు. అధికారంలో హస్తం చేతుల్లోనే ఉన్నా, ఆ రాష్ట్రం తమ ఆధీనంలోనే ఉన్నదనే భావన వారిలో ఉన్నది. అందుకే ఎప్పుడంటే అప్పుడు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చివేయొచ్చనే అభిప్రాయంలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత అక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చి, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారనటంలో సందేహం లేదు. కాకపోతే తెలంగాణపైనే మోదీలాంటి వాళ్లకు ప్రత్యేక దృష్టి ఉన్నది. ఇందుకు రెండు బలమైన కారణాలు ఉన్నాయి.

- గతంలో బీజేపీకి దేశవ్యాప్తంగా కేవలం రెండు ఎంపీ సీట్లు ఉన్నపుడు అందులో ఒక సీటు తెలంగాణలోని హనుమకొండ స్థానం. అక్కడి నుంచి జంగారెడ్డి బీజేపీ ఎంపీగా గెలిచారు. పైగా ఇక్కడ బలమైన బీజేపీ, ఆరెస్సెస్ క్యాడర్ ఉన్నది. ఇలా చరిత్ర చూస్తే ఇంత అనుకూలంగా ఉన్నప్పటికీ పార్టీ ఆశించిన స్థాయిలో ఎందుకు ఇక్కడ సక్సెస్ కాలేకపోయింది? వ్యూహాలు ఎక్కడ దెబ్బతిన్నాయి? ఇలా అనేక సందేహాలు బీజేపీ పెద్దల్లో ఉన్నాయి. అందుకే పట్టుదలతో తెలంగాణపై ఫోకస్ పెట్టారు.
- రెండోది.. వామపక్ష భావజాలం. దేశంలోని ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం ఉన్నా, బేస్ తెలంగాణ నుంచే ఉన్నది. కమ్యూనిస్టు రాష్ట్రంగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీని దెబ్బకొట్టగలిగినా, తెలంగాణలో పూర్తిగా తుడిచిపెట్టలేకపోతున్నామనే భావన వారిలో ఉన్నది. అందుకే ఇక్కడ పాగా వస్తే తప్ప వామపక్ష భావమూలాలను పెకిలించలేమనే నిర్ణయానికొచ్చారు.

**ఐదారు నెలలు పొంగులేటి సంప్రదింపులు**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దాదాపు ఐదారు నెలల పాటు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారు. ఒక దశలో ఆయన ఆ పార్టీలోకే వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో జరిగిన చర్చల్లో పొంగులేటి కవిత అరెస్టు డిమాండ్‌ను బీజేపీ ముందుంచారు. ఆ పార్టీ పెద్దలు అది కుదరదని చెప్పేశారు. కనీసం కాళేశ్వరం అక్రమాలంటూ అప్పటి సీఎం కేసీఆర్‌ను టార్గెట్ చేయాలని కోరారు. కానీ అది మొదటికే మోసం వస్తుందని, కేసీఆర్ లాంటి ఉద్యమకారుడిని టచ్ చేస్తే బూమరాంగ్ అవుతుందని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. దీంతో పొంగులేటి మనసు మార్చుకున్నారు. ఇదే కారణాన్ని చూపి బీజేపీలో చేరేందుకు నిరాకరించారు.

**ఎన్నికల తర్వాత అసలైన సెకండాఫ్**

ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఎవరికివారు బీజేపీతో టచ్‌లో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ గేమ్ ప్లాన్‌లో అసలైన సెకండాఫ్‌ను మొదలు పెట్టనున్నది. అయితే ఇందులో అటు రేవంత్? ఇటు పొంగులేటి? ఎవరిని ఎంచుకోవాలనే దానిపై ఆ పార్టీ పెద్దల్లో పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చినట్టు లేదు. రేవంత్‌రెడ్డి 18 మంది ఎమ్మెల్యేలు, పొంగులేటి 12 మంది ఎమ్మెల్యేలు.. మద్దతు ఉన్నట్టుగా బీజేపీకి చెప్పుకున్నట్టు తెలిసింది. ఎలాగూ బీజేపీకి 8 మంది ఉన్నారు. వీటితో గేమ్‌ను మొదలుపెడితే అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు వరదలా వచ్చిపడతారనే అంచనాతో బీజేపీ ఉన్నది. ఎందుకంటే ఒక్క ఎమ్మెల్యే లేని రాష్ట్రంలోనే బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందంటే వాళ్ల దాడి ఎలా ఉంటదో ఊహించుకోవచ్చు. ఏకంగా 16 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చేశారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే ఇక తిరుగేముంది? ప్రతిపక్షాలు డీలా పడతాయి. ఇందులో రేవంత్‌రెడ్డికి మొదటి ఆప్షన్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆయనను పెద్దగా నమ్మటం లేదు. పొంగులేటి ఇప్పటికే ఐదారు నెలల పాటు టచ్‌లో ఉండటంతో పాటు కాంట్రాక్టర్, వ్యాపారవేత్త అయినందున తమ కనుసన్నల్లో ఉంటాడనే నమ్మకం బీజేపీ పెద్దల్లో ఉన్నది.

**ప్రపంచీకరణతోనే ప్రజల్లో చైతన్యం పోయింది**

ఎన్నికల తర్వాత బీజేపీ గేమ్‌ప్లాన్‌లో భాగంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ ముఖ్యమంత్రిగా ఇక్కడ కూర్చునే అవకాశాలు ఉన్నాయి. గతంలో కూడా ఆయన ఎప్పుడూ బీజేపీ చెడ్డ పార్టీ అని చెప్పలేదు. కేవలం కేసీఆర్‌ను దించాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమైనందున ఆ పార్టీలోకి వెళ్తున్నానని చెప్పారు. 1984లో నాదెండ్ల భాస్కర్‌రావు ఎపిసోడ్ జరిగినపుడు నేను పీపుల్స్‌వార్ పార్టీలో పని చేస్తున్నాను. ఎన్టీఆర్‌ను దించినందుకు ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లు, వీధుల్లోకి వచ్చి తిరుగుబాటు చేశారు. కానీ ఇప్పుడు ఆ చైతన్యం లోపించింది. 1991 ప్రపంచీకరణ తర్వాత ప్రధానంగా మధ్యతరగతి అనేది విస్తృతమైంది. దీంతో శాస్త్రవేత్త మొదలు సామాన్య కూలీ వరకు ఈఎంఐ బతుకుల్లో బందీ అయ్యారు. నాకెందుకు? అది నా సమస్య కాదు కదా! ఇలాంటి చట్రంలో ఇరుక్కుపోయారు. లేకపోతే, రాజ్యాంగాన్నే మారుస్తామని బీజేపీ ఎంపీ ప్రకటించినా బుద్ధిజీవులు ఎందుకు నోరు మెదపటం లేదు. కనీసం రాజ్యాంగం ద్వారా ఫలాలు, ప్రయోజనాలు పొందుతున్న వారు కూడా దీనిపై గళం విప్పడం లేదంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

## వామపక్షం అయోమయం

- ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఐ, సీపీఎం ప్రయత్నాలు
- నోరు మెదపని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు
- పొత్తు లేకపోతే రెండు స్థానాల్లో పోటీకి సీపీఎం సై

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాలు పోటీ చేస్తాయా? లేదా? అనే అంశంపై అయోమయం నెలకొన్నది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని సీపీఐ, సీపీఎం భావిస్తున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. తమ పొత్తు వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పంథా కొనసాగించాలని, కనీసం ఒక్క స్థానమైనా తమకు కేటాయించాలని సీపీఐ నేతలు కోరుతున్నారు. ఖమ్మం, భువనగిరి, నల్లగొండ, పెద్దపల్లి, వరంగల్ నియోజకవర్గాల్లో ఏదో ఒకటి కేటాయించాలని సీపీఐ ప్రతిపాదిస్తున్నది. ఒకవేళ కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోయినా, తాము సొంతంగా పోటీ చేసే అవకాశం లేదని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 22 లేదా 25న జరిగే పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకొంటామని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. సీపీఎం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు ప్రయత్నిస్తున్నది. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో ఏదో ఒకటి కేటాయించాలని ఆ పార్టీ కాంగ్రెస్‌ను కోరుతున్నది. కనీసం రెండు స్థానాల్లో పోటీ చేయాలని సీపీఎం నిర్ణయించింది. బుధవారం జరిగే సీపీఎం సమావేశంలో పోటీ, పొత్తులపై స్పష్టత రానున్నది. వామపక్షాలతో పొత్తుపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు నోరుమెదపడం లేదు.


**CAUTION NOTICE**

This is to caution the general public, banks and financial institutions etc., that my client **M/S G. Vikas Reddy and Co. and others,** Jubilee Hills, Hyd were constrained to file a suit for specific performance of agreement of sale, Cancellation/Declaration of Sale deeds executed in favor of other 3rd parties as illegal, nonest, null and void in OS No. 6 of 2024 and ad interim injunction in IA No. 167 & 168 from alienating or creating 3rd party interests before the Hon'ble Principal District Judge, Vikarabad, Telangana against Mr. T. Shobhan Babu, M/S J.B Infra Group, Hyd and others in respect of schedule of properties which is forming part of agricultural lands under survey numbers in all the three (3) villages under the project name **JB's Pride** located in **Sy no. 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 102, 250, 241, 242, 252, 253, 28, & 29 to an extent of Ac 108.23** Gts atKesaram village of Mominpet Mandal, RR District, located in **Sy no. 102, 103, 104, 105, 141, 142, 143, 144, 138, 137, 134, 148, 147, 145, 149, 150, 151, 152, 159, 160, 163, 164, 158, 16, 18, 1074, 1474, 144** etc., to an extent of Ac 109.00 Gts at Veerlapally village of Marpally Mandal & located in **Sy no. 119,120,121, 35 & 36** etc., to an extent of Ac 35.07 Gts at **Yenkepally village of Mominpet Mandal, RR District** presently in Vikarabad District, Telangana.

It is reliably learnt **Mr. T. Shoban Babu, J.B Infra Group** (Def. No. 45) and others in collusion are illegally and fraudulently executing/ creating the sale deeds etc., in favor of 3rd parties under the guise of the DTCP layout and TS-RERA approval etc.,

Since the said matter is subjudiced **under section 52** of the transfer of property act applies to the said properties, which aims to maintain **"Status Quo"** during the said ongoing litigation to prevent change in ownership rights.

Hence, all the general public and financial institutions etc., are hereby cautioned against the above event and misrepresentation.In spite of this notice, if anyone chooses to deal with the above said suit schedule properties or anyone claiming through them, such transaction would be void, fraudulent and cannot bind on my said clients, but expose them to **civil & criminal** consequences, at their own cost, risk and peril.

Signed by:
**D. Amarnath Reddy,** Advocate
Flat no. 102, Thirumala Vaishnavi Residency,H. NO 1-1-651/A/1, New Bakaram, Gandhinagar, Hyd. Ph : 9849801256


# ప్రయోజనం జీరో

మొదటిపేజీ తరువాయి...

ఉంటున్న వారిని ప్రస్తావించలేదు. ఫలితంగా సొంతూరుకు దూరంగా హైదరాబాద్ వంటి నగరాలు, పట్టణాల్లో ఉంటున్న లక్షలాదిమంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తుల గడువు ముగిశాక కిరాయి ఇంట్లో ఉన్నా దరఖాస్తు చేస్తే జీరో బిల్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వ తీరుతో ఒకే భవనంలో కిరాయికి ఉంటున్న కొందరికి జీరో బిల్లు వస్తే మరికొందరికి రావడం లేదు. మరికొందరు తాము కిరాయికి ఉంటున్న ఇంటి సర్వీసు నంబరుతో సొంతూరులో దరఖాస్తు చేసినా ఉపయోగం లేకుండా పోయింది.

**మార్చుకునేది ఎలా?**

కిరాయి ఇంట్లో ఉండి గృహజ్యోతి పథకాన్ని పొందుతున్నవారు ఏదైనా కారణంతో ఇల్లు మారితే ఎలా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఈ విషయంలోనూ ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు లేవు. పిల్లల చదువు కోసం కొందరు విద్యాసంస్థలకు దగ్గరగా ఇండ్లు కిరాయికి తీసుకుని ఉంటారు. స్కూళ్లు మారినా, పై చదువుల కోసం వేరే చోటికి వెళ్లినా మళ్లీ అక్కడికి మారాల్సి ఉంటుంది. సాధారణంగా ఇలాంటివన్నీ ఏప్రిల్ నుంచి మొదలవుతుంటాయి. ఇల్లు మారినప్పుడు ఏం చేయాలనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది.

**అసలు విషయం చెప్పలేదు**

గృహజ్యోతి నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రకటించిన ప్రభుత్వం అసలు విషయం మాత్రం దాచిపెట్టింది. 200 యూనిట్లు దాటితే పరిస్థితి ఏంటన్న విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడేమో 200 యూనిట్లకంటే ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా పథకం అమలు కాదని అధికారులు తీరిగ్గా సెలవిస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే 200 యూనిట్లు దాటిన ప్రతి ఒక్కరు మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

- ఖమ్మం జిల్లా బోనకల్‌వాసి రవికుమార్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రజాపాలనలో భాగంగా సొంతూరులో దరఖాస్తు చేసిన సమయంలో గృహజ్యోతి కోసం తాను కిరాయికి ఉంటున్న ఇంటి యూఎస్‌సీ నంబర్ ఇచ్చాడు. ఇప్పుడేమో జీరో బిల్లు రావడం లేదు. అధికారులను అడిగితే ఖమ్మంలో దరఖాస్తు చేస్తే ఇక్కడెలా వస్తుందని ఎదురు ప్రశ్నించారు. అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న నల్లగొండ జిల్లాకు చెందిన మరో కుటుంబానికి మాత్రం జీరో బిల్లు వచ్చింది.

**సవరణలకు అవకాశమే లేదు**

ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో అనేక తప్పిదాలు జరిగాయి. ప్రభుత్వం ఓవైపు హడావుడి పెట్టడం, వేలాది దరఖాస్తులు, కొండంత సమాచారం నమోదు చేయాల్సి రావడంతో డాటా ఎంట్రీ ఆపరేటర్లు తడబడ్డారు. యూఎస్‌సీ నంబర్లు చాలావరకు తప్పుగా నమోదయ్యాయి. ఫలితంగా కుటుంబానికి రావాల్సిన జీరో బిల్లు మరో కుటుంబానికి వస్తున్నది. వివరాలు సరిచేద్దామన్నా సవరణకు ఎక్కడా అవకాశం లేకుండా పోయింది.

### క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆగ్రహం

ప్రభుత్వం చేసిన తప్పిదాలు క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బందికి తలనొప్పిగా మారాయి. అనేకమంది తమకు జీరో బిల్లు ఎందుకు అమలు కావడం లేదని నిలదీస్తున్నారు. డాటా ఎంట్రీ తప్పులకు మమ్మల్ని బలిచేస్తారా? అని మండిపడుతున్నారు. కొన్నిచోట్ల స్థానిక కాంగ్రెస్ నేతలను కూడా నిలదీస్తున్నారు. దీని నుంచి తప్పించుకునేందుకు వారు ఈసారికి కరెంటు బిల్లు కట్టాని, కోడ్ ముగిశాక జీరోబిల్లు వస్తుందని నచ్చజెబుతున్నారు. మరోవైపు, పెండింగ్ బిల్లుల వసూలుకు వెళ్తే ప్రజలు తిరగబడుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన మార్గదర్శకాలు అమలుచేయాలని, పూర్తిస్థాయిలో అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేస్తున్నారు.


